వంతెన పూర్తయ్యేదెన్నడో..!




2



2


ఉపాధి హామీ కూలీల ఆందోళన

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా స్వామివారిని పల్లకీపై ఊరేగించి ప్రత్యేక ఊంజల సేవ నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజు గర్భిణులకు ఇచ్చే దివ్య ఔషధ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సైతం కొనసాగించారు.

- అక్షరటుడే, ఇందూరు





# కాలిపోతున్న పంటలు

■ ఎండల ధాటికి దగ్ధమవుతున్న వైనం ■ ఆందోళనలో అన్నదాతలు ■ ఆదుకోవాలని వేడుకోలు

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఎండల ధాటికి చిన్న నిప్పు రవ్వ పడితే కార్చిచ్చు చెలరేగుతోంది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పంటలు కాలి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక చోట మంటలు అంటుకుంటే.. ఎండలు, గాలికి అవి ఎకరాల మేర వ్యాపిస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట.. కాలి బూడిద అవుతోంది. కోతకు వచ్చిన పంట కాలిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఇంటినుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వ్యవసాయదారులు పొలం బాట పట్టాలంటే భయపడుతున్నారు. అయినా కోతల సమయం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయ భూముల వద్దకు వెళ్తున్నారు. ఎండల తీవ్రతకు పలువురు ఇప్పటికే వడదెబ్బ తగిలి ఆస్పత్రి పాలయ్యారు.


### 300 ఎకరాలు

కామారెడ్డి జిల్లాలో గురువారం సుమారు 300 ఎకరాల పంట అగ్నికి ఆహుతి అయింది. మద్నూర్ మండలంలోని శేఖాపూర్, అంతాపూర్, కోడిచెర్ల తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల మొక్కజొన్న, వరిపంట, జొన్న పంటలు దగ్ధమయ్యాయి. ఎండ వేడి ధాటికి పంటలు కాలిపోయాయని తెలుస్తోంది. కాగా.. మరోవైపు గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రతకు చిన్న నిప్పురవ్వ పడినా మంటలు దట్టంగా వ్యాపిస్తున్నాయి.

### ఈత వనం దగ్ధం

జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో శుక్రవారం సుమారు 200 ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామ శివారులో పెంచిన ఈత వనంలో ఈత చెట్లు కాలిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎండల తీవ్రత ప్రభావంతో ఎక్కడైనా నిప్పురవ్వ వెలిగి కార్చిచ్చుకు కారణం అయి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో వరుసగా పంటలు, ఈత వనాలు దగ్ధం కావడం పట్ల బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.







## ఉచిత ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న షెడ్యూల్డ్ కులాల వసతి గృహంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఫౌండేషన్ కోర్సును కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు పది బ్యాచ్‌లలో 800 మందికి శిక్షణ అందించగా.. వారిలో 199 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం 11వ బ్యాచ్ లో 93 మంది ఫౌండేషన్ కోర్సులో చేరారని, వీరికి ఐదు నెలల పాటు ఉచిత భోజన వసతి సదుపాయాలతో నాణ్యమైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత, సహాయ అధికారి రాజ గంగారాం, స్టడీ సర్కిల్ డైరెక్టర్ దేవిదాస్ తదితరులున్నారు.

## శ్మశాన వాటికల అభివృద్ధిలో నాయకులు వెనకబడ్డారు: చంద్రశేఖర్ రెడ్డి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గం నుంచి పలువురు నేతలు ఎమ్మెల్యేలు, మంత్రులు, విప్‌లుగా పనిచేసినా.. పట్టణంలో ఉన్న శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడంలో వెనకబడ్డారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పట్టణంలో రెండు హిందు శ్మశాన వాటికల్లో వసతులు లేవని, దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో టుఫిడ్‌కో నిధుల ద్వారా హౌసింగ్ బోర్డు శ్మశాన వాటికకు రూ.3 కోట్లు, ఇందిరానగర్ శ్మశాన వాటికకు రూ.60 లక్షలు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ హయాంలో టుఫిడ్‌కో నిధుల ద్వారా హౌజింగ్ బోర్డు శ్మశాన వాటికకు రూ.80 లక్షలు, ఇందిరానగర్ శ్మశాన వాటికకు రూ.50 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో డీసీసీ జిల్లా కార్యదర్శి జూలూరు సుధాకర్, కౌన్సిలర్ గడ్డమీది మహేష్, క్రేడా అధ్యక్షుడు నర్సాగౌడ్, మాజీ కౌన్సిలర్లు వంశీ, సలీమ్, జమీల్, నాయకులు రంగ రమేష్ గౌడ్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

**అక్షరటుడే, లింగంపేట:** ముదిరాజ్‌లు విద్యా, ఆర్థిక రంగాలతో పాటు రాజకీయం గానూ ఎదగాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. లింగంపేట మండలంలోని పోల్కంపేటలో శుక్రవారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో ముది రాజ్‌లది కీలక పాత్ర అని అన్నారు. ప్రతి గ్రామంలోనూ సంఘటితమై కుల గౌరవాన్ని చాటాలని చెప్పారు.

### పలువురికి సన్మానం

వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను, గ్రామ పెద్దలను బుర్ర జ్ఞానేశ్వర్ సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు, ఉద్యమకారుడు నిజ్జన రమేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బట్టు విట్టల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంద బాలయ్య, మండలాధ్యక్షుడు సాయికుమార్, యూత్ జిల్లా కార్యదర్శి బొల్లారం క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



## పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి గ్రామాన్ని, ప్రజలను చల్లగా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దివిటి రమేష్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, గాండ్ల నర్సింలు, గన్ను నాయక్, కిరణ్, మహేష్, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజుకు సన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ నాగరాజు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ నాగరాజు ఉద్యోగులకు అందిస్తున్న సేవలను, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ కృష్ణ మోహన్, బీసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, గౌరవ



అధ్యక్షుడు కైరంకొండ బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ సలహాదారులు రమణ స్వామి, మాక్లూర్ మండల బీసీటీయూ అధ్యక్షుడు గంగోనె సంజీవ్, నాయకులు సుమన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుంటే కఠినచర్యలు: అడిషనల్ కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక.. 'బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ'లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో దత్తత సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పోర్టల్ ద్వారా పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా అక్రమంగా దత్తత తీసుకున్న వారిపైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో వచ్చే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియను కావాల్సిన పత్రాలను, ప్రభుత్వ మార్గదర్శకాలను అందజేయాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన దంపతులకు బాబును దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మెడికల్ ఆఫీసర్





డాక్టర్ వెంకటేష్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్యకుమార్, కార్యాలయం సిబ్బంది అనిత, అనిల్, ముజాహిద్, స్రవంతి, గణేష్ పాల్గొన్నారు.

## అర్హులైన వికలాంగులందరికీ వాహనాలు అందజేయాలి: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** అర్హులైన వికలాంగులందరికీ ప్రభుత్వం ప్రత్యేక వాహనాలు అందజేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మహిళ శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం వికలాంగులకు ప్రత్యేక వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న బ్యాటరీ వాహనాలకు మోక్షం కలిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ వాహనాలు అందేలా చొరవ చూసుకోవాలని పేర్కొన్నారు. తాను సైతం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు కలిసి లేఖను అందజేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కోసం అనేక పథకాలను అందజేస్తుందని చెప్పారు. ప్రత్యేక పరికరాలతో పాటు రెండు లక్షల ఆర్థికసాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి పద్మ, ప్రాజెక్ట్ అధికారి సౌందర్య, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, న్యాలం సునీత రాజు, మురళి జ్యోతి, శశాంక్, నాయకులు పవన్ ముందడ పాల్గొన్నారు.




## బాల భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: డీఎంహెచ్‌వో

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** బాల భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. నగరంలోని జీజీహెచ్‌లో ఏడో అంతస్తులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాల భరోసా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. ఐదేళ్ల పిల్లల అభివృద్ధిలో జాప్యాలు.. నాడీ సంబంధిత అభివృద్ధి సమస్యలు గుర్తించేందుకు బాల భరోసా కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిలా సంక్షేమాధికారిణి పద్మ శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నాగమోహన్ మాట్లాడుతూ.. శారీరక వైకల్యాలున్న పిల్లలకు చికిత్స అందించడానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ అశోక్ మాట్లాడుతూ మే నెలలో సెలవులున్నాయని.. కావున ఆర్



బీఎస్‌కే టీంలు స్క్రీనింగ్ చేయడానికి అంగన్‌వాడీ టీచర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మెడికల్ హెల్త్ టీం వైద్యులు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దాహం తీర్చుకునేందుకు పావురాల పాట్లు

**ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. ఈ ఎండల్లో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఈ క్రమంలో నగరంలోని గంజ్ ప్రాంతంలో ఓ కుళాయి వద్ద లీకైన నీటిధార వద్ద పావురాలు దాహార్తి తీర్చుకున్నాయి.**

**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**

## తిప్పారం తండాలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని తిప్పారం తండాలో కోదండ రామాలయం వద్ద క్రికెట్ టోర్నీని శుక్రవారం ఎస్సై మహేందర్ ప్రారంభించారు. సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు యువకుల మధ్య టోర్నీ ఉత్సాహంగా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా టోర్నీ ఆర్గనైజర్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.15,000గా ఉంటుందని.. రెండో బహుమతి రూ.10 వేలు నిర్ణయించినట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1,500 ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో గ్రామస్థులు, వార్డు మెంబర్లు యువకులు పాల్గొన్నారు.




## లింగంపేటలో విద్యుత్ వారోత్సవాలు

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని లింగంపేట, శెట్పల్లి సంగారెడ్డి సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి డీఈ విజయ సారధి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది అలాగే వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేసేటప్పుడు విధిగా ఎర్త్ డిస్చార్జింగ్ రాడ్‌ను వాడాలని సూచించారు. అలాగే రైతులు వారి పంపు సెట్ల దగ్గర ఐరన్ స్టార్టర్ బాక్స్ బదులుగా ప్లాస్టిక్ స్టార్టర్ బాక్స్‌లు బిగించుకోవాలని, సొంతంగా ఎలక్ట్రికల్ పరికరాలను తాకవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఈ మల్లేష్, ఏఈలు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వంతెన పూర్తయ్యేదెన్నడో..!

గతేడాది కురిసిన భారీ వర్షా లకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. జిల్లాలో ముఖ్యంగా లింగంపేట, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో కేకేవై రహదారిపై లింగంపల్లి గ్రామం వద్ద వంతెన తెగిపోయి లింగంపేట, ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వంతెన ఎంతో కీలకంగా ఉన్న ఇప్పటివరకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు అవస్థలు అవుతున్నారు. ఈ ఏడాది వర్షా కాలంలో తప్పనిసరిగా మళ్లీ రాకపోకలు స్తంభిస్తాయని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.
– అక్షరటుడే, లింగంపేట

- కేకేవై రహదారిపై అవస్థల ప్రయాణం..
- తాత్కాలిక వంతెన నిర్మించినా కష్టాలే..
- వచ్చే వర్షా కాలంలో పెరగనున్న ఇబ్బందులు
- వెంటనే వంతెన పనులు పూర్తిచేయాలని విన్నపాలు..





వర్ష బీభత్సానికి లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద కేకేవై రహదారిపై వంతెన తెగిపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి వచ్చి వంతెనను పరిశీలించారు. తాత్కాలిక వంతెన కోసం రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో పాములవాగుపై తాత్కాలికంగా రోడ్డును వేశారు. దీంతో తాత్కాలిక వంతెన పైనే వాహనాలు, బస్సుల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆ నిధులతోనే కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు వర్షానికి దెబ్బతిని.. గుంతలు పడ్డ రోడ్డుపై ప్యాచ్‌వర్క్ నిర్వహించారు.

### వచ్చే వర్షా కాలంలో మళ్లీ..

గతేడాది కురిసిన వర్షాలకు లింగంపల్లి వద్ద పాముల వాగు వంతెన తెగిపోవడంతో సుమారు 45 రోజులపాటు ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకుండా పోయాయి. లింగంపేటకు ఎల్లారెడ్డికి వాహనాలు, బస్సులు, లారీలు నడవక చాలామంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడాది వర్షాలు కురిస్తే మళ్లీ అదే పరిస్థితి వస్తుందని వాహనచోదకులు, ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఈ వంతెనను తాత్కాలికంగా కాకుండా పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

కేకేవై రహదారిపై లింగంపల్లి కుర్దు వద్ద పాముల వాగు వంతెన, అడవి లింగాల్ వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కను కలిసి సమస్యను విన్నవించారు. ఈ వంతెనను త్వరితగతిన పూర్తి పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే రెండు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు కానున్నట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు చెప్పారు.

## దూదిగాంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని దూదిగాం గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి ప్రారంభించి, రైతులతో మాట్లాడారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. రైతులకు న్యాయమైన ధరలు అందేలా ఈ కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ బారి, సర్పంచ్ బాబా, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక నాయకుడికి సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో మేడే కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తరపున కార్మిక నాయకుడు అబ్దుల్ రజాక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చాలామంది కార్మికులకు లేబర్‌కార్డులు లేవని.. దీంతో వారికి ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందట్లేదన్నారు. అధికారులు చొరవ తీసుకుని కార్మికులందరికీ లేబర్‌కార్డులు వచ్చేవిధంగా చూడాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుమోహన్, అడిషనల్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం శశికుమార్ పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థ అభివృద్ధి చేస్తే ప్రభుత్వ ఖర్చులెందుకు..?



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని హౌజింగ్ బోర్డు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థ ముందుకు వస్తుంటే ప్రభుత్వ ఖర్చుతో డీపీఆర్ తయారు చేయాల్సిన అవసరం ఏముందని బీజేపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. హౌజింగ్ బోర్డు శ్మశాన వాటికను చైర్మన్‌తో సహా బీజేపీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు శుక్రవారం పరిశీలించారు. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం చేయాల్సిన పనుల విషయంలో డీపీఆర్ తయారీకి ప్రతిపాదనల కోసం పట్టణంలోని రెండు శ్మశానాల సందర్శనను బీజేపీ కౌన్సిలర్లు తిరస్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రెండు రోజుల క్రితం స్వచ్ఛంద సంస్థ ద్వారా అభివృద్ధి చేయటానికి ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్ రెడ్డి ముందుకు వచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ఇన్ని రోజులు లేనిది కొత్తగా శ్మశాన వాటికలకు రూ.1.30కోట్లతో డీపీఆర్ తయారు చేయటానికి చైర్మన్ సమక్షంలో కౌన్సిలర్లు సందర్శన పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా అభివృద్ధి చేస్తామంటుంటే ప్రభుత్వం తరపున ఖర్చు చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఆ డబ్బులు పట్టణంలో వార్డుల అభివృద్ధికి కేటాయిస్తే బాగుంటుందని సూచించారు.

## ఆలూర్‌లో వరిసాగుపై అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఆర్మూర్:** మండల కేంద్రంలో 'వరిసాగులో ఆధునిక పద్ధతుల'పై రైతులకు అవగాహన కల్పించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలు, సర్పంచ్ ముక్కెర విజయ్ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వరిపంటలో అధిక దిగుబడి సాధించాలంటే ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. ముఖ్యంగా విత్తనాల ఎంపిక, నాటే విధానం, నీటి నిర్వహణ, ఎరువుల సరైన వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరణ ఇచ్చారు. యూరియా వినియోగంలో పరిమితి పాటించాలని, అధికంగా వాడితే పంటకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు. అలాగే, నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడడం ద్వారా ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని సూచించారు. కీటకనాశకాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సమయానికి పంట సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రాంబాబు, శాస్త్రవేత్త రాకేష్, ఏఈఓ వసుధం గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ కూలీల ధర్నా



**అక్షరటుడే, ముప్కాల్:** ఉపాధి హామీ పనులు జరిగే చోట సౌకర్యాలు కల్పించాలని కూలీలు ఆందోళన నిర్వహించారు. ముప్కాల్ మండలం వన్నెల్ (బి) గ్రామంలో ఆందోళన నిర్వహించారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ కనీసం తాగునీరు అందించడం లేదని, టెంట్లు ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఒకరి పేరుపై మరొకరు పని చేయడం, తక్కువ మంది పనిచేసినా ఎక్కువ మందిగా ఫొటోలు తీసి నమోదు చేయడం వంటి అనేక అక్రమాలు జరుగుతున్నాయని కూలీలు ఆరోపించారు. ఈ విషయాలను కూలీల తరపున పబ్బ రత్నయ్య వెల్లడించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూలీలు అధికారులను కోరారు.



## టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంకు సన్మానం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను బీసీటీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. టీఎన్జీవోస్ సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పురుషోత్తం కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆయన నాయకత్వంలో నిజామాబాద్ టీఎన్జీవోస్ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కంచరి రవికుమార్, వేణు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.


## తండ్రిని కత్తితో పొడిచిన కొడుకు..

**అక్షరటుడే, బాన్సువాడ:** తండ్రీకొడుకుల మధ్య ఏర్పడిన చిన్న వివాదంలో ఘర్షణ ఏర్పడింది. ఇది చివరకు హత్యాయత్నానికి దారి తీసింది. ఈ ఘటన మోస్రా మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకోగా స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోస్రా మండలానికి చెందిన ముస్తఫా (తండ్రి), అతని కుమారుడు అమాన్ మధ్య కొంతకాలంగా కుటుంబ సంబంధిత విషయాలపై విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ముస్తఫా తన భార్యతో గొడవ జరిగింది. దీనిని అమాన్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో తండ్రీ కొడుకు మధ్య మళ్లీ వాగ్వాదం చెలరేగింది. మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన అమాన్.. ఇంట్లో ఉన్న కత్తితో తండ్రిపై దాడి చేసినట్లు తెలిసింది. ఈ దాడిలో ముస్తఫాకు తీవ్రమైన గాయాలవడంతో తీవ్రరక్తస్రావం జరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు ముస్తఫాను నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

## డంపింగ్ యార్డు వద్ద ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డంపింగ్ యార్డు వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామ పరిధిలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుడైన చాకలి రాజు (35) డంపింగ్ యార్డు వద్ద ఆత్మహత్య చేసుకున్నట్లు అతని సోదరి లింగంపల్లి మంజుల పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో వెంటనే నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో వ్యక్తిగత, ఆర్థిక సమస్యల కారణంగా రాజు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భార్గవ గౌడ్ తెలిపారు.







# ఘనంగా మేడే

ఉమ్మడిజిల్లాలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే సంబరాలు మిన్నంటాయి. నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కార్మికులు ఎర్రజెండాలను ఆవిష్కరించి ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా పలుచోట్ల కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం వక్తలు మేడే ప్రాముఖ్యతను వివరించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్







